సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం ¦ 18 ¦ మే ¦ 2025



వైభవం.. రథోత్సవం

వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగులోని నారాపురస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం కనుల పండువగా జరిగింది.
-8లో



ఈత సరదాకు విద్యార్థి బలి

స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన కలికిరి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి చింతా రాకేష్ బలైన దుర్ఘటన శనివారం జరిగింది.
-8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.82	రూ.95
రెండోరకం	రూ.64	రూ.80

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 903 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

మెరుగైన జీవనోపాదుల కల్పనే లక్ష్యం

వీరబల్లి: మెరుగైన జీవనోపాదుల కల్పనే లక్ష్యంగా పనిచేయాలని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం మండల సమాఖ్య కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సమీకృత వ్యవసాయంలో మంచి జీవనోపాదులు, ప్రకృతి సమతుల్యత, ఆరోగ్యంపై దృష్టి సారించినట్లు చెప్పారు. జీవనోపాదుల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నాగార్జున మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో భాగంగా మునగ సాగుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. మండలంలో 100 ఎకరాల్లో మునగ వ్యవసాయం ద్వారా ప్రాసెసింగ్ యూనిట్‌కు ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు చెప్పారు. స్థానిక ఏపీఎం ఖాదర్ వల్లి తదితరులు పాల్గొన్నారు.

31న చలో సంగమేశ్వరం

కడప రూరల్: రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో ఈనెల 31న సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవ సంగమేశ్వర సభను జయప్రదం చేయాలని రాయలసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీష్ పిలుపునిచ్చారు. రాయలసీమ విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం కడపలో సంగమేశ్వర సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అంటే అమరావతి, పోలవరం కాదన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలను అమలు చేయడంతో పాటు రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీని అమలు చేయాలన్నారు. అందులో భాగంగా జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడంతో పాటు పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి సాగు, తాగునీరు అందించాలన్నారు.

రెడ్డిపల్లి రైల్వేస్టేషన్ పరిశీలన



కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ప్రజలు

పుల్లంపేట: పుల్లంపేట మండలంలోని రెడ్డిపల్లి రైల్వేస్టేషన్‌ను శనివారం డీఆర్‌సీసీయూ మెంబర్ తల్లెం భరత్ కుమార్‌రెడ్డి, కడప సీసీ సురేంద్రనాథ్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ కమిటీ పరిశీలించింది. ఈ సందర్భంగా వారు గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ రెడ్డిపల్లి రైల్వేస్టేషన్‌ను 1851లో ప్రారంభించారని, ఈ రైల్వేస్టేషన్‌కు చాలా ప్రాముఖ్యత ఉందని తెలిపారు. అలాగే ఈ స్టేషన్‌లో గతంలో చెన్నై, ముంబైకి బొగ్గు, ఎర్రగడ్డలు, నిమ్మకాయలు, తమలపాకులు రవాణా జరుగుతుండేదని తెలిపారు. కరోనా సమయం నుంచి ఈ రైల్వేస్టేషన్‌లో రైళ్ల నిలుపుదల లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు కమిటీ సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం గ్రామస్తులతో కమిటీ సభ్యులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముస్తాక్ పాల్గొన్నారు.

ఆశ.. నిరాశ..





కోచింగ్ తీసుకుంటున్న డీఎస్సీ అభ్యర్థులు (ఫైల్)

- మెలికలతో నష్టపోయిన డీఎస్సీ నిరుద్యోగులు
- ముగిసిన దరఖాస్తు ప్రక్రియ

మదనపల్లె సిటీ: అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటిస్తామంటూ ఆర్భాటంగా ఎన్నికల్లో హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల తర్వాత నోటిఫికేషన్ ఇచ్చింది.దీంతో ఆశపడిన నిరుద్యోగ డీఎస్సీ అభ్యర్థులకు నిరాశే మిగిలింది. కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్‌లో ఊహించని విధంగా మెలికలు విధించింది. దీంతో జిల్లాలో చాలా వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేకపోయారు. రిజర్వ్‌డు అభ్యర్థుల అర్హత మార్కులను 40 శాతానికి తగ్గించి, టెట్‌లో వీరికి ఇచ్చిన నింబధనల మేరకు డీఎస్సీకి అర్హత మార్కులు తగ్గించినట్లు ప్రకటించింది. అయితే ఇదే టెట్‌లో జనరల్ అభ్యర్థులకు 45 శాతం మార్కుల నిబంధన ఉన్నా పట్టించుకోకుండా సుప్రీంకోర్టు తీర్పు, ఎన్‌సీటీఈ గెజిట్‌కు విరుద్ధంగా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేసింది. దీంతో చాలా మంది డీఈడీ, బీఈడీ చేసిన జనరల్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేకపోయారు.

- డీఎస్సీ పరీక్షలు ఉమ్మడి జిల్లాల పరిధిలో నిర్వహిస్తున్నారు. చిత్తూరు జిల్లాలో డీఎస్సీ పరీక్షలకు 26,501 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 16,348 మంది మహిళలు అత్యధికంగా దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో అన్ని యాజమాన్యాలు కలుపుకుని 1,478 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. గత నెల 20వతేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈనెల 30వ తేదీన హాల్ టిక్కెట్లు విడుదల చేయనున్నారు.

ఒక్కో పోస్టుకు 31 మంది వరకు పోటీ

అందిన దరఖాస్తుల ప్రకారం ఒక్కో పోస్టుకు 31 మంది పోటీ పడనున్నారు. ఈ డీఎస్సీకి పోటీ ఉండటంతో అభ్యర్థులు పుస్తకాలతో కుస్తీపడుతున్నారు. కొందరు కోచింగ్ సెంటర్లలో, మరికొందరు ఇళ్లల్లో పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.

ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో...

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 15,812 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో మహిళలు 9598 మంది, పురుషులు 6,214 మంది ఉన్నారు. అన్ని యాజమాన్యాలు కలుపుకుని 705 పోస్టులు భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది.

మహిళలే అత్యధికం



ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా డీఎస్సీ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారిలో మహిళలే అత్యధికంగా ఉన్నారు. 26,501 మంది దరఖాస్తు చేసుకోగా అందులో మహిళలు 16,348 మంది, 10,153 మంది పురుషులు ఉన్నారు. అయితే కొందరు అభ్యర్థులు తమ అర్హతలను బట్టి పలు సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో..

రిజర్వేషన్ కేటగిరీ	దరఖాస్తు చేసిన అభ్యర్థులు
ఓసీ	2,856
బీసీ-ఏ	4,000
బీసీ-బీ	3,790
బీసీ-సీ	101
బీసీ-డి	2,570
బీసీ-ఈ	1,661
ఎస్సీ-గ్రేడ్-1	4
ఎస్సీ-గ్రేడ్-2	1,872
ఎస్టీ	1.650
ఈడబ్ల్యూఎస్	1,664
పీహెచ్‌లో వీహెచ్	134
పీహెచ్‌లో హెచ్‌హెచ్	57
పీహెచ్‌లో ఎంఐ	11
ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో...	
ఓసీ	2371
బీసీ-ఏ	1455
బీసీ-బీ	2451
బీసీ-సీ	175
బీసీ-డి	1422
బీసీ-ఈ	1652
ఎస్సీ-గ్రేడ్-1	1
ఎస్సీ-గ్రేడ్-2	2204
ఎస్టీ	3215
ఈడబ్ల్యూఎస్	866
పీహెచ్‌లో వీహెచ్	68
పీహెచ్‌లో హెచ్‌హెచ్	411
పీహెచ్‌లో ఎంఐ	4

మనోజా.. మజాకా!

- ప్రజాధనంతో మహానాడుకు సొగసులు
- టీడీపీ సేవలో కమిషనర్ మనోజ్ రెడ్డి



కమిషనర్ మనోజ్ రెడ్డి



కడప కార్పొరేషన్ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, కడప: కడప కార్పొరేషన్ అధికారులు తెలుగుదేశం పార్టీ సేవలో మునిగితేలుతున్నారు. ముఖ్యంగా కమిషనర్ మనోజ్ రెడ్డి పూర్తి టీడీపీ నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. నగరంలో పలు చోట్ల సరైన రోడ్లు లేవు.. డ్రైనేజీ కాలువల్లేవు.. ప్రజా సమస్యలు పట్టించుకోకుండా అధికార పార్టీ సేవలో నిమగ్నమయ్యారు. ఈ నెల 27న ప్రారంభమయ్యే మహానాడు కోసం ఏకంగా కార్పొరేషన్ నిధులనే ఖర్చు చేస్తున్నారు. మహానాడుకు నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలంటూ సుందరీకరణ పేరుతో లక్షల రూపాయల కార్పొరేషన్ నిధులను ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యారు. ఓ వైపు ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి కూడా ఇబ్బంది పడుతూ, ఇదివరకే చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోయినా టీడీపీ సేవలో తరించడం విమర్శలకు దారితీస్తోంది.

- 'నిబంధనలు ఎలా ఉన్నా మా ఎమ్మెల్యే చెప్పారు.. అంతే' అంటున్నారు కార్పొరేషన్ అధికారులు. ఓ రాజకీయ పార్టీ సమావేశానికి కార్పొరేషన్ నిధులు ఖర్చు చేయడం ఏంటనే ప్రశ్న ఇప్పుడు కడప వాసుల నుంచి వినిపిస్తోంది. సుమారు 25 లక్షల రూపాయల నిధులను చంద్రబాబు మహానాడుకు వెళ్లే మార్గంలో మొక్కలు నాటడానికి, సర్కిళ్లలో పెయింటింగ్స్ వేయించి తీర్చిదిద్దడానికి ప్రతిపాదనలు పెట్టారు. రాజకీయ పార్టీ సమావేశానికి సీఎం చంద్రబాబు వస్తుంటే ప్రజాధనం ఖర్చు చేయడం ఏంటని నగరవాసులు నిలదీస్తున్నారు.

పాలకవర్గం నో చెప్పినా...

సీఎం చంద్రబాబు వెళ్లే దారిలో ఆయన కంటికి ఇంపుగా కనిపించాలని లక్షలాది రూపాయలు నిధులు వెచ్చించేందుకు సిద్ధమయ్యారు. ఇదే అంశాన్ని స్టాండింగ్ కౌన్సిల్ దృష్టికి తీసుకురాగా, ఓ పార్టీ కార్యక్రమానికి తామెలా నిధులిస్తామని ప్రశ్నించింది. దీంతో తనకున్న అధికారాలతో కమిషనర్ మనోజ్ రెడ్డి ప్రభుత్వ పెద్దలు, స్థానిక టీడీపీ నేతల మెప్పు కోసం పనులను విభజించి మంజూరు చేశారు. ఇది నిబంధనలకు విరుద్ధమని, కార్పొరేషన్లో అసలే నిధులు లేక అల్లాడుతుంటే ఇలా చేయడం సరికాదని పాలకవర్గం వాపోతున్నా అస్సలు వినడం లేదు. మరో వైపు ఉద్యోగులకు క్రమం తప్పకుండా జీతాలు ఇవ్వడం లేదు. ఇప్పటికే జనరల్ ఫండ్ ద్వారా రూ.54కోట్లు పనులకు బిల్లులు చెల్లించలేదని పలువురు వాపోతున్నారు. ఇలా ఖర్చు చేయడం సరికాదని పలు రాజకీయ పక్షాలు విమర్శిస్తున్నాయి. ఎవరెన్ని విమర్శలు చేసినా.. స్వామి భక్తి ముందు ఇవేమీ పనికి రావని కడప కమిషనర్ తేల్చేశారు. నిధుల మంజూరులో తనకున్న విచక్షణను వినియోగించి మహానాడు సేవలో తరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

చెత్త రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలి

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి, కలెక్టర్, జేసీ, అధికారులు

రాయచోటి: రాయచోటి పట్టణాన్ని చెత్తరహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని, పచ్చదనాన్ని పెంపొందించాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాయచోటిలోని ఎస్ఎన్ కాలనీ మోర్ మార్కెట్ సమీపంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర,స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంత్రి జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్‌తో కలిసి మొక్కలు నాటారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని సూచించారు.

- అత్యంత పరిశుభ్ర జిల్లాగా అన్నమయ్యను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేద్దామని జిల్లా కలెక్టర్ కోరారు. ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. అధికారులు తమ కార్యాలయాల్లో, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పరిశుభ్రత కార్యక్రమాలు వేగవంతం చేయాలన్నారు. అంతకుముందు జూనియర్ కళాశాల గ్రౌండ్ నుంచి బంగ్లా సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. బంగ్లా సర్కిల్ వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలతో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్, కమిషనర్ వాసుబాబు, పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్ పిళ్లై తదితరులు పాల్గొన్నారు.

మొక్క బారెడు.. గుంత జానెడా..

మున్సిపల్ కమిషనర్‌ను హెచ్చరించిన కలెక్టర్

రాయచోటి : మొక్క చూస్తే ఏపుగా పెరిగి బారెడు ఉంది. మొక్కను నాటడానికి తీసిన గుంత మాత్రం జానెడే ఉంది. ఇలా మొక్కలు నాటితే అవి ఎలా బతుకుతాయంటూ మున్సిపల్ కమిషనర్‌పై కలెక్టర్ చలోక్తులతో కూడిన హెచ్చరికలు చేశారు. ఒక మొక్క నాటాలంటే కనీసం మూరెడు గుంతైనా తవ్వాలని సూచించారు. శనివారం ఇక్కడ కలెక్టర్ మాట్లాడుతూ ఇంతమంది ప్రజా ప్రతినిధులు, అధికారుల సమక్షంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతుంటే తూతూ మంత్రంగా జానెడు గుంత తవ్వి మొక్క నాటి గాలికి వదిలేయడం ఏమాత్రం పద్ధతి కాదన్నారు. మొక్క నాటిన తర్వాత సంరక్షణ బాధ్యత మున్సిపాలిటీ అధికా రులు, సిబ్బంది తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

నేడు మంత్రుల రాక

కడప సెవెన్‌రోడ్స్: మహానాడు ఏర్పాట్ల పరిశీలన కోసం ఆదివారం పలువురు మంత్రులు కడప నగర పర్యటనకు వస్తున్నారు. ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి మధ్యాహ్నం 2.30 గంటలకు కడపకు చేరుకుంటారు. మహానాడు జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తారు. సాయంత్రం బనగానపల్లెకు చేరుకుంటారు.

- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మధ్యాహ్నం 12.30కికడపకు చేరుకుని ఇక్కడి కార్యక్రమాల్లో పాల్గొని రాత్రి 9.00 గంటలకు బయలుదేరి వెళ్లనున్నారు.
- కార్మికశాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ మధ్యాహ్నం 12.35 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుని అనంతరం స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారు.
- రెండు రోజుల పర్యటన నిమిత్తం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత జిల్లాకు రానున్నారు.

రైల్వేట్రాక్‌కు ఫెన్సింగ్!

- ఎన్‌హెచ్ సమీపంలో గోడలు
- రూ.3,200 కోట్ల బడ్జెట్
- కేటాయించిన ఎస్సీ రైల్వే



ఉభయవైఎస్సార్ జిల్లా మీదుగా వెళ్లే ముంబై-చెన్నై కారిడార్ రైలుమార్గం

రాజంపేట: ముంబై-చెన్నై కారిడార్ రైలుమార్గంలో ఉభయ వైఎస్సార్‌జిల్లాలో పరిధిలోని రైల్వేట్రాక్‌కు ఇరువైపులా ఫెన్సింగ్ వేసేందుకు సౌత్‌సెంట్రల్ రైల్వే సిద్ధమైంది. ఇప్పటికే దాదాపు అన్ని లైన్లను 130 కిలోమీటర్ల స్పీడ్‌తో వెళ్లేలా సామర్థ్యం పెంచిన నేపథ్యంలో ట్రాక్‌కు ఎలాంటి అంతరాయం తలెత్తకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

కట్టుదిట్టమైన చర్యల్లో భాగంగా..

మూగజీవాలు, వన్యప్రాణులు, పాడిపశువులు, సంఘవిద్రోహ శక్తులు ట్రాక్‌పైకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలలో భాగమే ఫెన్సింగ్‌ను తెరపైకి తీసుకొచ్చింది. ఇందుకోసం తెలుగు రాష్ట్రాల్లో నిర్మాణానికి రూ.3,200 కోట్లు కేటాయించింది. వాడి, గుంతకల్,కాజీపేట, కడప, తిరుపతి, గూడూరు తదితర మార్గాల్లో ఫెన్సింగ్ లేదా గోడలు, సబ్‌వేలు నిర్మించాలని ప్రతిపాదించారు. ఆయా రూట్ల ఆధారంగా నిధులు కూడా విడుదల చేసింది.

రెండేళ్ల క్రితమే..

వందేభారత్ లాంటి హైస్పీడ్ రైళ్ల కోసం ఎస్సీ రైల్వే రెండేళ్ల క్రితమే తన పరిధిలోని అన్ని ప్రధానమార్గాల్లో 130 కిలోమీటర్లకు పైగా వేగాన్ని తట్టుకునేలా సామర్థ్యాన్ని పెంచింది. దీంతో హైస్పీడ్ రైళ్లు తిరుగుతున్న పట్టాలపై జంతువులు,మనుషులు రాకుండా స్టీల్ ఫెన్సింగ్ ఏర్పాటుచేయనున్నారు. నేషనల్ హైవేల సమీపంలో ఉన్న ట్రాక్‌లపై క్రియోసెట్ ఆయిల్‌తో ట్రీట్ చేసిన హెచ్‌డీపీ వెదురుబొంగులతో ఫెన్సింగ్ లేదా గోడలు నిర్మించనున్నారు. మరికొన్ని చోట్ల సబ్‌వేలు ఏర్పాటుచేస్తున్నారు.

మార్గం	పట్టాల సామర్థ్యం (కి.మీ)
రేణిగుంట-బెజవాడ	130
రేణిగుంట-గుంతకల్	130
గుంతకల్-ధర్మవరం	110
ఎర్రగుంట్ల-నంద్యాల	110
కృష్ణపట్నం-ఓబులవారిపల్లె	110

మంచి ఆలోచన



రైల్వే పట్టాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలనుకోవడం మంచి ఆలోచన. హైస్పీడ్ రైళ్లు తిరుగుతున్న పట్టాలపై జంతువులు, మనుషులు రాకుండా స్టీల్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలనే యోచన ప్రశంసనీయం. గ్రామీణ ప్రాంతాల్లో గొర్రెలు, మేకలు, ఆవులు, ఎద్దులు ట్రాక్‌మీదపడిమరణిస్తున్నాయి.ఫెన్సింగ్ కాపాడుతుందనేది నా భావన. -పీవీ మిథున్‌రెడ్డి, ఎంపీ , రాజంపేట

ఫెన్సింగ్ అవసరమే



హైస్పీడ్ రైళ్లు నడిచేలా ట్రాక్ సామర్థ్యం పెంచుతున్న క్రమంలో రైల్వే ట్రాక్ ఫెన్సింగ్ అవసరమే. మూగజీవాలు, వన్యప్రాణులు, పాడి పశువులు ట్రాక్‌పైకి రాకుండా కట్టుదిట్టమైన చర్యల్లో భాగంగా ఫెన్సింగ్‌ను తెరపైకి తీసుకురావడం అభినందనీయం. -మేడా రఘునాథరెడ్డి, రాజ్యసభ సభ్యుడు, రాజంపేట

హుండీ ఆదాయం లెక్కింపు

రాజుపాళెం: మండలంలోని వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల ఆలయాల్లో శనివారం హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖ సహాయ కమిషనర్ జి.మల్లికార్జున ప్రసాద్,ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ రెడ్డిల ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టారు. నాలుగు నెలల తొమ్మిది రోజుల గాను రూ.542314 వచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రామ మోహన్, అర్చకులు, భక్తులు, సేవకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో అవ్వ, మనవడు దుర్మరణం




మృతిచెందిన సారమ్మ, జశ్వంత్

కలసపాడు : మండలంలోని సింగరాయపల్లె గ్రామానికి చెందిన యంబడి సారమ్మ (45), తలారి జశ్వంత్ (15) కలసపాడు సమీపంలోని ఐటీఐ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు సారమ్మ, ఆమె మనుమడు జశ్వంత్ సింగరాయపల్లెలో మూడు రోజులు జరిగే తిరునాలకు సరుకులు తీసుకువచ్చేందుకు కలసపాడుకు వెళ్లారు. సరుకులు తీసుకుని స్వగ్రామానికి వస్తుండగా కలసపాడు సమీపంలోని ఐటీఐ వద్ద చెన్నుపల్లె నుంచి గొర్రెల లోడుతో వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. సారమ్మ అక్కడికక్కడే మృతిచెందగా జశ్వంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు జశ్వంత్‌ను కలసపాడులోని ఓ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. మృతదేహాలను పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక వైఎస్సార్ సర్కిల్ సమీపంలోని వెంకటేశ్వర వైన్స్ ముందు శనివారం సాయంత్రం గుర్తు తెలియని వృద్ధుడు(70) మృతి చెందాడు. ఇతను గత కొంత కాలంగా ఈ ప్రాంతంలో యాచన చేస్తూ తిరుగుతుండేవాడు. మద్యం కోసం వైన్ షాపు వద్దకు వెళ్లి మద్యం తీసుకొని వర్షం వస్తుండడంతో అక్కడే నిలబడ్డాడు. ఉన్నట్లుండి కుప్పకూలి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌వీఐ బాధితులకు అండగా.!

- కౌన్సెలింగ్‌తో మనోధైర్యం
- ఉచితంగా మందులు పంపిణీ
- నేడు అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం

ఐసీటీసీ కేంద్రాలు
మదనపల్లె, పీలేరు, వాల్మీకిపురం, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, రాయచోటి, రాజంపేట, లక్కిరెడ్డిపల్లె, రైల్వేకోడూరు

ఏఆర్‌టీ కేంద్రం
మదనపల్లె



క్యాండిల్స్‌తో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, స్వచ్ఛంద సంస్థలు(ఫైల్‌ఫొటో)

మదనపల్లె సిటీ : కౌన్సెలింగ్‌తో హెచ్‌ఐవీ బాధితులకు మనోధైర్యం కల్పిస్తున్నారు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (శాక్స్) వ్యాధి నివారణకు నివారణ చర్యలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ సెంటర్లు(ఐసీటీసీ)లు ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది మే మూడవ ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌తో చనిపోయిన వారిని మేము గుర్తుంచుకుంటాం, మేము మాట్లాడుతాం, మేము నడిపిస్తాం అనే నినాదం ఇచ్చారు. వ్యాధితో మృతి చెందిన వారికి ఆత్మశాంతి కలగాలని కోరుతూ క్యాండిల్స్ వెలిగించి నివాళులు అర్పిస్తారు.

హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌తో బాధపడుతున్నవారికి ఏఆర్‌టీ (యాంటీ రిట్రోవైరల్) కేంద్రాలు అండగా నిలుస్తున్నాయి. ఆత్మస్థైర్యాన్ని నింపేలా కౌన్సెలింగ్‌ను ఇవ్వడంతో పాటు అవసరమైన మందులను అందిస్తున్నారు. జిల్లాలో మదనపల్లెలో ఏఆర్‌టీ కేంద్రం ఉంది. దీంతో పాటు రాయచోటి, పీలేరు ఏఆర్‌టీ ప్లస్, తంబళ్లపల్లె, బి.కొత్తకోట, వాల్మీకిపురం, రాజంపేట, లక్కిరెడ్డిరెడ్డి, రైల్వేకోడూరులలోని ప్రభుత్వ సీహెచ్‌సీలలో లింక్ ఏఆర్‌టీ కేంద్రాలున్నాయి. ఆయా ఐసీటీసీ కేంద్రాల్లో నిర్వహించే రక్తపరీక్షల్లో హెచ్‌ఐవీ పాజిటివ్ ఉందని తెలితే వారికి కౌన్సెలింగ్ ఇస్తూ వారిలో మనోధైర్యం నింపుతున్నారు. వారందరిని ఏఆర్‌టీ కేంద్రాల్లో నమోదు చేసి మందులు అందజేస్తారు. నేషనల్ ఎయిడ్స్ ఆర్గనైజేషన్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీలు పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో వ్యాధిని రూపుమాపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. హెచ్‌ఐవీ వచ్చాక బాధపడేకన్నా దాని బారిన పడకుండా చూసుకోవాలని పలు కార్యక్రమాలతో చైతన్యం పెంచుతున్నారు. ముందు జాగ్రత్తనే అసలైన మందు అనే విషయాన్ని వివరిస్తున్నారు. గతంతో పోలిస్తే బాధితులకు మందులు సకాలంలో అందిస్తుండటంతో ఆరోగ్యం మెరుగవుతోంది. ఏటా పరీక్షల సంఖ్యను పెంచుతూ పాజిటివ్ కేసులను గుర్తిస్తున్నారు. హెచ్‌ఐవీ పాజిటివ్ గల గర్భిణికి ముందుగా పీపీటీసీటీ చికిత్స అందిస్తూ పుట్టబోయే బిడ్డను ఎయిడ్స్ నుంచి కాపాడే ప్రయత్నాలు జిల్లాలో జరుగుతున్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం..



జిల్లాలో తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలు గుర్తించి ఆ ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నాం. కళా బృందాలతో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. బాధితులకు అండగా నిలుస్తున్నాం. వారికి మనోధైర్యం కల్పిస్తున్నాం. ఆదివారం సాయంత్రం అన్ని ప్రభుత్వ ఆస్పత్రులో క్యాండిల్స్ వెలిగించి మరణించిన వారి ఆత్మశాంతి కోసం నివాళులు అర్పిస్తాం.

– డాక్టర్ శైలజ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి, రాయచోటి

ఈత సరదాకు ఇంజినీరింగ్ విద్యార్థి బలి




విద్యార్థి చింతా రాకేష్ మృతదేహం (ఇన్‌సెట్) చింతా రాకేష్ (ఫైల్)

కలికిరి : ఈత సరదాకు కలికిరి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి బలైన దుర్ఘటన శనివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. జేఎన్టీయూ కళాశాల నుంచి శనివారం మధ్యాహ్నం సుమారు పది మంది విద్యార్థులు కళాశాల సమీపంలోని ఓ వ్యవసాయ బావి వద్దకు ఈతకెళ్లారు. ఈత వచ్చిన వారు ఈత ఆడుతుండగా ఈత రాని వారు గట్టుపై కూర్చుని చూస్తున్నారు. ఈ క్రమంలో సివిల్ ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పెంట గ్రామానికి చెందిన సూర్యనారాయణ కుమారుడు చింతా రాకేష్(18) ఈతకు పై నుంచి దూకాడు. దీంతో పూడిక మట్టిలో ఇరుక్కుపోయాడు. గమనించిన స్నేహితులు కాపాడటానికి ప్రయత్నించినా ఉపయోగం లేక పోవడంతో కళాశాలకు వెళ్లి అధ్యాపకులకు, సిబ్బందికి సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వారు పోలీసులకు సమాచారం అందజేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు పీలేరు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సాయంతో సుమారు మూడు గంటల పాటు శ్రమించి విద్యార్థి మృతదేహాన్ని వెలికి తీశారు. విద్యార్థి కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ మదన్‌మోహన్ రెడ్డి తెలిపారు.

విద్యార్థుల పట్ల పర్యవేక్షణ కరువు...

జేఎన్టీయూ కళాశాల విద్యార్థుల పట్ల పర్యవేక్షణ కరువవ్వడంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని సంఘటనా స్థలానికి చేరుకున్న స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు నిత్యం కళాశాల బయటకు వెళ్తూ వస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. రాత్రి సమయాల్లోనూ ఇలాగే జరుగుతోందని, సంఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బందిపై మండిపడ్డారు. గతంలోనూ ఇలా ఓ విద్యార్థి ఈతకెళ్లి మృతి చెందినా కళాశాల అధికారులకు కనువిప్పు కలగలేదని చెప్పారు.

ఉత్సాహంగా క్యారమ్స్ పోటీలు



క్యారమ్స్ పోటీలలో తలపడిన విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో శనివారం క్యారమ్స్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. బాలికల విభాగంలో ప్రశాంతి ప్రథమ, దేవిశ్రీ ద్వితీయ స్థానంలో నిలిచారు. బాలుర విభాగంలో అండర్ 11 పోటీలలో రెమంత్ ప్రథమ, అబ్దుల్‌ఖాదర్ ద్వితీయ స్థానంలో, అండర్ 14 విభాగంలో రంగనాథ్ ప్రథమ, ద్వారకనాథ్ ద్వితీయ స్థానంలో నిలిచారు. పురుషుల విభాగంలో ఆబిద్ ప్రథమ, జశ్వంత్ ద్వితీయ స్థానంలో విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో వాలీబాల్ కోచ్ శ్రీనివాసులు, హ్యాండబాల్ కోచ్ మునాఫ్, బాడ్మింటన్ కోచ్‌లు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన పిడుగు

అంగళ్లులో ఇద్దరి మృతి




మృతి చెందిన క్రిష్టప్ప, ఖాదర్‌వలీ

కురబలకోట : కురబలకోట మండలం అంగళ్లులో శనివారం రాత్రి పిడుగు పాటు ఇద్దరి ప్రాణాలను బలి తీసుకుంది. ఈ విషాదకర సంఘటనకు సంబంధించి సో   కథనం మేరకు...శనివారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో కురబలకోట మండలంలోని అంగళ్లులో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. అంగళ్లు టమాటా మార్కెట్‌లో ఓ మండీలో ఖాదర్ వలీ (41) రైటర్‌గా పనిచేసేవాడు. ఇతనిది మదనపల్లె దగ్గర కోళ్లబైలు కాలనీ. అంగళ్లు మార్కెట్‌లో టమాటాలను లోడు చేయిస్తూ దగ్గరున్న చెట్టు కింద ఉండగా పిడుగు పడింది. దీంతో ఒక్కసారిగా ఆయన కిందపడిపోయాడు. అతన్ని బతికించడానికి స్థానికులు విశ్వప్రయత్నం చేశారు. ఆసుపత్రికి ఆటోలో తరలిస్తుండగా చనిపోయారు. అదే సమయంలో టమాటా మార్కెట్‌కు మరో వైపు సమీపంలోని ఓ టీ స్టాల్‌లో టీ తాగడానికి వచ్చిన మండలంలోని తుంగావారిపల్లెకు చెందిన నాయపు క్రిష్టప్ప (60) కూడా పిడుగు పాటుకు ఉన్నట్లుండి కిందపడి పోయాడు. ఆయన కూడా నిమిషాల వ్యవధిలో చనిపోయాడు. ఇతను అవివాహితుడు. ఒకే సమయంలో వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు పిడుగుపాటుకు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది.

నిరంకుశత్వం, కక్ష సాధింపే కూటమి ప్రభుత్వ లక్ష్యం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికారప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో నిరంకుశత్వం, కక్ష సాధింపే లక్ష్యంగా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికారప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి లక్ష్యంగా వారిపై కేసులు పెట్టేందుకు గత ప్రభుత్వం నిర్వహించిన మద్యం పాలసీని సాకుగా చూపుతున్నారన్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా సంబంధం లేని ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహరెడ్డి, బాలాజీ, రాజ్‌కసిరెడ్డిలను అరెస్టు చేసి వారివద్ద బలవంతపు వాంగ్మూలాలు తీసుకొంటున్నారని ఆరోపించారు. సీఐడీని పావుగా వాడుకుంటున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో మద్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి సిండికేట్‌గా మారి విచ్చల విడిగా బెల్ట్ షాపుల ద్వారా దోచుకొంటున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వంలో ప్రభుత్వం ద్వారానే నిర్వహించి ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చామన్నారు. ఇవేకాకుండా రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసాలు చూస్తే ఆటవిక, అరాచక పాలన నడుస్తోందని అర్థమవుతోందన్నారు. కొత్త పథకాలు ఇవ్వక పోగా ఉన్న పథకాలు ఆపేసి దోపిడీలు, దౌర్జన్యాలకు తెరలేపారని ధ్వజమెత్తారు. వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీహెచ్ రమేష్, జిల్లా యువజన అధ్యక్షుడు శివారెడ్డి, మండల నాగేంద్ర, తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బండారుమల్లి, డీసీరమణ, దామర్ల సిద్దయ్య, వెంకటరెడ్డి, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. రథోత్సవం

- నారాపుర వేంకటేశ్వర స్వామి వారి రథోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికిన ముస్లింలు



పాత బస్టాండ్‌లో రథాన్ని లాగుతున్న భక్తులు



హిందువులకు పుష్ప గుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలుకుతున్న ముస్లింలు

జమ్మలమడుగు : నారాపురస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం కనుల పండువగా జరిగింది. శనివారం ఉదయం ఆలయంలో భూదేవి, శ్రీదేవి సమేత నారాపుర వేంకటేశ్వర స్వామికి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు.

తరలి వచ్చిన భక్తులు..

స్వామి వారికి రథోత్సవాన్ని తిలకించేందుకు మండల పరిధిలోని ప్రజలే కాకుండా మైలవరం, పెద్దముడియం, కర్నూలు ప్రాంతాలనుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. భక్తులకు దాతలు మజ్జిగ ప్యాకెట్లు అందించారు. పట్టణంలోని దుకాణదారులు సైతం దుకాణాల ముందు వారికి తోచిన పానీయాలు పంపిణీ చేశారు.

వెల్లివిరిసిన మత సామరస్యం ..

పట్టణంలో వెంకటేశ్వర స్వామి రథోత్సవంలో భాగంగా ముస్లింలు పాత బస్టాండ్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు, మున్సిపల్ కౌన్సిలర్ ముల్లాజానీ ఆధ్వర్యంలో హిందువులకు గులాబీ పుష్పాలతో స్వాగతం పలికారు. అనంతరం అందరికీ పాయసం అందించారు. హిందు ముస్లిం భాయీ భాయీ అంటూ పరస్పరం ఆలింగనం చేసుకుని మత సామరస్యం చాటారు.

ఆక్రమణల పేరు చెప్పి అరాచకం

- వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్‌లో తాత్కాలిక నిర్మాణాల తొలగింపు
- ఎమ్మెల్యేకు, ఫిరాయింపు కార్పొరేటర్లకు వ్యతిరేకంగా మాట్లాడినందుకు కక్ష సాధింపు



వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద నిర్మాణాలను జేసీబీతో కూల్చివేస్తున్న దృశ్యం

కడప కార్పొరేషన్ : కడప శాసనసభ్యురాలు ఆర్. మాధవి ఆదేశాలతో కడప నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆక్రమణల పేరుతో అరాచకం సృష్టిస్తున్నారు. తనకు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా వారి ఆస్తులను ధ్వంసం చేయడం లేదా వారి ఆర్థిక మూలాలను దెబ్బతీసే పనిలో ఎమ్మెల్యే, వారి అనుచరులు నిత్యం నిమగ్నమవుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా మొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఎమ్మెల్యేకు, వైఎస్సార్‌సీపీ నుంచి పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లకు వ్యతిరేకంగా ప్రెస్‌మీట్ పెట్టి విమర్శించారు. 24వ డివిజన్ కార్పొరేటర్ కె. సూర్యనారాయణ, 2వ డివిజన్ కార్పొరేటర్ సుబ్బారెడ్డిలపై ఆరోపణలు చేశారు. అలా మాట్లాడిన మరుసటి రోజే మద్రాసు రోడ్డులో నగరపాలక సంస్థకు చెందిన వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఆక్రమణలున్నాయంటూ టౌన్‌ప్లానింగ్ అధికారులను ఉసిగొల్పి కూల్చివేశారు. సదరు వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్‌లో రెండు గదులను జయచంద్రారెడ్డి లీజుకు తీసుకొని ఉండటం గమనార్హం. షాపింగ్ కాంప్లెక్స్ లీజుకు ఉన్నవారంతా వర్షం పడకుండా, వర్షపు నీరు షాపు ముందు నిలబడకుండా, షాపులోకి వచ్చి వెళ్లేందుకు వీలుగా తాత్కాలికంగా రేకులు అమర్చుకొని, ముందువైపు తాపలు, ర్యాంపులు ఏర్పాటు చేసుకున్నారు. అయితే అవన్నీ పర్మినెంట్ స్ట్రక్చర్స్ కాదు. ముఖ్యంగా మున్సిపల్ ఉర్దూ బాలుర హైస్కూల్ ప్రహరీ, మున్సిపల్ స్టేడియం పక్కన నగరపాలక సంస్థ నిర్మించిన పబ్లిక్ టాయ్‌లెట్లు వీటికంటే ముందుకు ఉన్నా....టౌన్‌ప్లానింగ్ అధికారులు వాటి జోలికి వెళ్లకపోవడం గమనార్హం. తాత్కాలిక నిర్మాణాలన్నీ విద్యుత్ స్తంభాలకు లోపలే ఉన్నప్పటికీ కూల్చివేయడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

– ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి



పెద్దతిప్పసముద్రం : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని పక్కన బెట్టిన చంద్రబాబు రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ తంబళ్లపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి కక్షపూరిత చర్యలకు పాల్పడుతూ కుయుక్తులు పన్నుతున్నారని మండిపడ్డారు. ఎన్నికల వేళ ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తుంగలో తొక్కి డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర లేపుతున్నారన్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లతో పాటు రిటైర్డ్ అధికారుల మీద కూడా కక్ష గట్టి తప్పుడు కేసులు బనాయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మద్యం కల్తీ జరుగుతోందని ఆరోపించిన వారే ఇప్పుడు అవే డిస్టలరీల నుంచి మద్యాన్ని ఎలా కొనుగోలు చేస్తారన్నారు. పరిపాలనలో చంద్రబాబు ఘోరంగా విఫలం కావడం వల్లే ప్రజల దృష్టిని మళ్లించేందుకు తప్పుడు రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఐటీ ఈడీల దర్యాప్తులో చంద్రబాబు స్కిల్ స్కాంలో అడ్డంగా దొరికి జైలుకు వెళితే ఇదంతా కేవలం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయించాడని దృష్టిలో ఉంచుకుని ఇప్పుడు కక్ష పూరిత చర్యలకు పాల్పడటం సమంజసం కాదన్నారు.

బాలిక అదృశ్యం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పులికల్లుకు చెందిన ఓ మైనర్ బాలిక (16) ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి అదృశ్యమైంది. చుట్టు పక్కల గ్రామాలు, బంధువుల ఊళ్లలో గాలించినా ఆచూకీ లభించలేదు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిహర ప్రసాద్ తెలిపారు.

మాటలకే స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర

– ఎగువ అబ్బవరం కాలనీలో తొలగని మురుగునీరు



మురుగునీటితో నిండిన ప్రాంతం వద్ద నిరసన తెలుపుతున్న స్థానికులు

రాయచోటి : రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు చెత్తరహిత ప్రాంతాలుగా మార్చాలని చెబుతున్నా స్థానిక మున్సిపల్ అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన వీధులు మినహా మిగిలిన వీధులలో ఎక్కడికి వెళ్లినా బురదమయమైన రహదారులు ముక్కుపుటాలు అదిరే దుర్గంధం వెదజల్లే చెత్తకుప్పలు కనిపిస్తాయి. శనివారం రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ మున్సిపల్ అధికారులు కలిసి స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎగువ అబ్బవరం కాలనీ(33వ వార్డు)లో మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాలు ఎక్కడా కనిపించలేదు. కాలనీలోని రోడ్లు చెత్తా చెదారం, మురికినీటితో నిండిపోయాయని ఆ వార్డు ప్రజలు వాపోతున్నారు. అబ్బవరం కాలనీలో కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోలేక పోతున్నామని చెబుతున్నారు. వర్షం వస్తే మురుగునీటి కాలువలు లేక మురుగునీరు రోడ్ల మీదనే ప్రవహిస్తుంది. మలేరియా లాంటి వ్యాధులు ప్రబలి ప్రజలు తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.

షోకాజ్ నోటీసులు అందుకున్న తహసీల్దార్

లింగాల : లింగాల మండల తహసీల్దార్‌గా 2022 నుంచి 2024 వరకు పనిచేసిన లక్ష్మీనారాయణ షోకాజ్ నోటీసులు అందుకున్నారు. 20 ఏళ్ల కాల పరిమితితో అసైన్డ్ భూములపై రైతులకు యాజమాన్య హక్కు కల్పిస్తూ చట్ట సవరణ చేసిన విషయం తెలిసిందే. అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేయడంలో 2003 సంవత్సరానికి ముందు ఉన్న భూములను చేయాల్సి ఉంది. అయితే లక్ష్మీనారాయణ 2024-25 సంవత్సర భూములను కూడా ఫ్రీ హోల్డ్ చేశారని విచారణలో తేలింది. మండలంలోని లోపట్నూతల, లింగాల, కామసముద్రం గ్రామాల్లోని 76 ఎకరాల అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేయడంపై జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ప్రస్తుత తహసీల్దార్ ఈశ్వరయ్య తెలిపారు.

పశువులు మేపుకునేందుకు వెళ్లి..

– పిడుగుపాటుకు వ్యక్తి మృతి

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో శనివారం సాయంత్రం పిడుగు పడి బాలాయపల్లె సుబ్బ రమణయ్య(40) అనే వ్యక్తి మృతి చెందాడు. గ్రామంలోని దళితవాడకు చెందిన బాలాయపల్లె సుబ్బరమణయ్య అలియాస్ సుబ్రమణ్యం శనివారం సాయంత్రం గేదెలు మేపుకునేందుకు గ్రామ సమీపంలోని స్మశానవాటిక దగ్గర ఉండే పొలాల్లోకి వెళ్లాడు. ఇతనితో పాటు సమీపంలో మరికొంత మంది మహిళలు గేదెలను మేపుకుంటున్నారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఈ క్రమంలో ఒక్కసారిగా పిడుగు పడటంతో అతను స్పృహ తప్పి పడిపోయాడు. అతను పడిపోయిన స్థలం వద్ద పశువులన్నీ గుంపుగా ఉండటంతో గుర్తించిన సమీపంలోని మహిళలు అతని వద్దకు వెళ్లారు. వెంటనే ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య ఆదిలక్ష్మితో పాటు యుక్త వయస్సుకు వచ్చిన కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిడుగు పాటుకు సుబ్బరమణయ్య మృతి చెందటంతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.